

'జలశక్తి' పనులు సంతృప్తికరం

జలశక్తి అభియాన్ పనులు సంతృప్తికరంగా ఉన్నాయని సెంట్రల్ టీమ్ నోడల్ అధికారి చిత్తరంజన్‌దాస్ కితాబిచ్చారు. కేంద్ర ప్రతినిధులు శుక్రవారం జిల్లాలో పర్యటించారు. 8లో▸



అన్నప్రసాద వితరణకు విరాళం

శ్రీశైలంటెంపుల్: దేవస్థాన అన్నప్రసాద వితరణ పథకానికి శుక్రవారం విజయవాడకు చెందిన కె.రామకోటిరెడ్డి రూ.1,01,116 విరాళాన్ని పర్యవేక్షకులు జి.రవికి అందజేశారు.



16 టీఎంసీలు.. 35వేల ఎకరాలు

తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) కింద ఖరీఫ్‌లో 35 వేల ఎకరాలకు 16 టీఎంసీల నీటి వినియోగానికి ఐఏబీ సమావేశం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 8లో▸

న్యూస్‌రీల్


కార్మిక శాఖ సంయుక్త కమిషనర్‌గా బాలునాయక్



బాలునాయక్‌ను అభినందిస్తున్న దృశ్యం

కర్నూలు(అర్బన్): తిరుపతి ఉప కార్మిక కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.బాలునాయక్‌కు సంయుక్త కమిషనర్‌గా పదోన్నతిపై కర్నూలుకు బదిలీ చేస్తూ కార్మిక శాఖ కమిషనర్ ఎంవీ శేషగిరి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన బాలునాయక్‌ను డీసీఎల్ కె.వెంకటేశ్వర్లు, ఏఎల్‌ఓ ఆర్.కేశన్న, ఏసీ సీతాలక్ష్మి, ఏఎల్‌ఓలు ఎంఎల్ రాంప్రసాద్, కె.హేమాద్రి, టి.శ్రీలక్ష్మి, ఈవీ రమణ తదితరులు పూలమాలలతో అభినందించారు.

ఉర్దూ వర్సిటీ వీసీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ పటాన్ షేక్షావలీ ఖాన్

కర్నూలు కల్చరల్: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్‌గా ప్రొఫెసర్ పటాన్ షేక్షావలీ ఖాన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ వీసీగా పనిచేస్తున్న ఫజలుర్ రహమాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో యోగి వేమన యూనివర్సిటీ బాటనీ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ షేక్షావలీ ఖాన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జ్ వీసీకి వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జహనారా, బోధన, బోధనేతర ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

పూర్వ జిల్లాలకు తహసీల్దార్లు

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల ముందు ఇతర జిల్లాలకు బదిలీపై వచ్చిన తహసీల్దార్లను పూర్వ జిల్లాలకు పంపేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈమేరకు ప్రభుత్వ ఆదేశాలు సీసీఎల్ఏకు వెళ్లాయి. అక్కడి నుంచి కలెక్టర్లకు ఆదేశాలు రాగానే ప్రస్తుతం పనిచేస్తున్న ప్రదేశాల నుంచి తహసీల్దార్లు రిలీవ్ కానున్నారు. అనంతరం తమకు కేటాయించిన జిల్లాల్లో రిపోర్టు చేసుకోవాల్సి ఉంటుంది.

హమ్మయ్యా.. గౌరవం దక్కింది!

సాక్షి ఎఫెక్ట్

మహానంది: ఎట్టకేలకు జాతి నేతలకు గౌరవం దక్కింది. తిమ్మాపురం సచివాలయంలో అధికారులు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటోల కింద మహాత్మాగాంధీ, అంబేడ్కర్‌ల చిత్రాలను ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని మహానుభావులారా..మన్నించండి శీర్షికన సాక్షి దినపత్రిక శుక్రవారం ప్రచురించింది. దీంతో స్పందించిన అధికారులు.. మహాత్మాగాంధీ, అంబేడ్కర్‌ల చిత్రపటాలను పైన ఏర్పాటు చేసి సీఎం, డిప్యూటీ సీఎంల చిత్రపటాలను కార్యదర్శి గదిలో ఏర్పాటు చేశారు.



దేశ నాయకులను పైన ఏర్పాటు చేసిన దృశ్యం

గొంతు తడిపేలా.. గొంతెత్తి

- తాగునీటి సమస్యపై గళమెత్తిన ఎమ్మెల్యేలు
- రిజర్వాయర్ల విస్తీర్ణాన్ని పెంచాలని సూచన
- నంద్యాల నీటి సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానన్న మంత్రి ఫరూక్
- ఎస్ఎస్ ట్యాంక్ నిర్మించాలని కోరిన ఎమ్మెల్యే విరూపాక్షి
- జెడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరైన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు
- కృష్ణా బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని తీర్మానం
- స్థాయీ సంఘాలకు సభ్యుల ఎంపిక



జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మంత్రులు ఫరూక్, టీజీ భరత్, జిల్లా కలెక్టర్లు రంజిత్‌బాషా, రాజకుమారి

కర్నూలు(అర్బన్): ''జిల్లాలోని అనేక ప్రాంతాల్లో తాగునీటికి ప్రజలు అల్లాడిపోతున్నారు. నదీతీర గ్రామాల్లో కూడా తీవ్ర మంచి నీటి ఎద్దడి నెలకొంది. రక్షిత మంచి నీటి పథకాలకు నీటిని సరఫరా చేసే దశాబ్దాల క్రితం వేసిన పైపులు చాలా చోట్ల లీకవుతున్నాయి. పైపుల లీకేజీతో కూడా పలు ప్రాంతాల్లో నీరు అందడం లేదని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఎస్ఎస్ ట్యాంకులను విస్తరించడంతో పాటు పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వాయర్లు నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సూచించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, కర్నూలు, నంద్యాల ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, ఎమ్మెల్యేలు కేఈ శ్యాంకుమార్, డాక్టర్ పార్థసారథి, బీ జయనాగేశ్వరరెడ్డి, గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి, జీ జయసూర్య, బీ విరుపాక్షి, కర్నూలు జిల్లా కలెక్టర్ పీ రంజిత్‌బాషా, నంద్యాల జిల్లా కలెక్టర్ జీ రాజకుమారి గణియా, జాయింట్ కలెక్టర్ టీ రాహుల్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. అజెండాలో పేర్కొన్న విధంగా వ్యవసాయం, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం, నీటి పారుదల, విద్యుత్ శాఖలపై సమీక్షించారు.

➤ గ్రామీణ నీటి సరఫరాపై జరిగిన సమీక్షలో ఆలూరు ఎమ్మెల్యే బీ విరూపాక్షి మాట్లాడుతూ ఎల్ఎల్‌సీ నీరు తమ నియోజకవర్గం నుంచి వెళ్తున్నా హాలహర్వి, హొళగుంద, ఆలూరు, ఆస్పరి మండలాల్లో తీవ్ర మంచి నీటి ఎద్దడి ఉందన్నారు. ప్రస్తుతం తాగునీరు అందిస్తున్న రిజర్వాయర్ల విస్తీర్ణాన్ని పెంచాలని, ఆస్పరి మండలం దాహార్తి తీర్చేందుకు జోహరాపురం వద్ద కొత్తగా ఒక ఎస్ఎస్ ట్యాంకును నిర్మించి హెచ్ఎన్ఎస్ఎస్ నీటిని లిఫ్ట్ చేయాలని కోరారు.

➤ జిల్లా కలెక్టర్ పీ రంజిత్‌బాషా మాట్లాడుతు ఆస్పరి మండలం నీటి సమస్య తీర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అవసరమైన అంచనాలను తనకు అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బీ నాగేశ్వరరావును ఆదేశించారు.

➤ కర్నూలు మండలంలోని దేవమ్మమడుగు ప్రాధాన్యతను గుర్తించాల్సిన అవసరాన్ని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

➤ అధికారులు చెప్పిన విధంగా జేజేఎం పనులు జరగలేదని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ఆరోపించారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్పందిస్తూ ఉమ్మడి జిల్లాలో జరిగిన జేజేఎం పనులపై పూర్తి స్థాయి విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు.



జెడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీటీసీ సభ్యులు

➤ నంద్యాల నీటి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతామని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ చెప్పారు.

విత్తన బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలి

ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో వ్యాపారులు రైతులకు అవసరమైన విత్తనాలను బ్లాక్‌మార్కెట్‌కు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ బి. పార్థసారథి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సరైన సమయానికి విత్తనాలు అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. గతంలో నకిలీ పత్తి విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టానికి గురయ్యారన్నారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించి పదేళ్ల సమాచారాన్ని అందించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా అందుతున్న సేవల గురించి రైతులకు తెలియడం లేదని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. గడివేముల మండలం కరిమద్దెల గ్రామంలో అనేక మంది బినామీ కౌలు రైతులు రైతు భరోసా కింద ఒక్కొక్కరు రూ.13,500 ప్రకారం స్వాహా చేశారని, విచారణ జరిపించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి కోరారు.

నీటి పారుదల అంశాలపై ప్రస్తావన

హంద్రీ–నీవా సుజల స్రవంతి పథకం పరిధిలోని 68 చెరువులకు నీరు అందించే కార్యక్రమం పూర్తి అయ్యిందా అని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్ ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టులో 30 శాతం పనులు కూడా జరగలేదని, అప్పుడే పైప్‌లైన్లు దెబ్బతిన్నాయని ఎమ్మెల్యే సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. 30 చెరువులకు నీరు అందించేందుకు ట్రయల్ రన్ పూర్తి చేశామని ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి చెప్పారు. గాజులదిన్నె ప్రాజెక్టులో నీటి నిల్వ, ఎత్తు పెంచడం తదితర అంశాలను ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీ జయనాగేశ్వరరెడ్డి ప్రస్తావించారు.

స్థాయీ సంఘాల సభ్యులుగా మంత్రులు, ఎమ్మెల్యేల ఎంపిక

జిల్లా పరిషత్‌కు సంబంధించిన ఏడు స్థాయీ సంఘాలకు ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలను సభ్యులుగా ఎన్నుకున్నారు. పలువురు జెడ్పీటీసీలు ప్రతిపాదించి, బలపరచగా వీరు ఆయా స్థాయీ సంఘాలకు సభ్యులుగా ఎంపికయ్యారు.

స్థాయీ సంఘం సభ్యులు

- మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్యేలు కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి
- ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి
- ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి
- ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి
- ఎమ్మెల్యేలు కేఈ శ్యాంకుమార్, బీ విరూపాక్షి
- ఎమ్మెల్యేలు బీ జయసూర్య, వై బాలనాగిరెడ్డి
- ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, గౌరు చరితారెడ్డి, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

ఇవీ తీర్మానాలు..

- విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన కృష్ణా బోర్డును కర్నూలుకు తీసుకురావాలని, ఈ మేరకు తీర్మానం చేయాలని కోడుమూరు, పాణ్యం ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, గౌరు చరితారెడ్డి కోరారు.
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉన్న 60 రక్షిత మంచి నీటి పథకాల నిర్వహణకు ఏడాదికి రూ.80 కోట్లు వ్యయం అవుతున్నదని, జిల్లా పరిషత్‌కు 15వ ఆర్థిక సంఘం ద్వారా వచ్చే రూ.23 కోట్ల నుంచి రూ.25 కోట్లు ఈ పథకాల నిర్వహణకు ఏమాత్రం సరిపోవడం లేదని, ఈ పథకాల నిర్వహణకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించాలని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తీర్మానం ప్రవేశపెట్టారు.
- వంద సంవత్సరాల చరిత్ర కలిగిన జిల్లా పరిషత్ పాత భవనాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, ఈ భవనాన్ని ఏపీ టూరిజంకు లీజ్‌కు ఇచ్చేందుకు తీర్మానం చేశారు.
- కర్నూలు, నంద్యాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం సుంకేసుల ప్రాంతంలో అదనంగా ఎస్ఎస్ ట్యాంకులను నిర్మించాలని తీర్మానం చేశారు.

అవినీతి 'రక్షకుల'పై బదిలీ వేటు

- ఒక ఏఎస్ఐ, ముగ్గురు హెచ్‌సీలు, ఇద్దరు పీసీలపై చర్యలు
- సీఐ, ఎస్ఐకి చీవాట్లు
- మరికొందరిపై వేటుకు రంగం సిద్ధం

పోలీస్ 'బాస్' కన్నెర్ర

కర్నూలు: వసూళ్ల రాయుళ్లపై ఎస్పీ గరికపాటి బిందుమాధవ్ కన్నెర్ర చేశారు. అక్రమార్కులను సహించనని టెలి కాన్ఫరెన్స్ ద్వారా క్షేత్రస్థాయికి సందేశాన్ని పంపిన మూడు రోజుల వ్యవధిలోనే ఎనిమిది మంది సిబ్బందిపై బదిలీ వేటు వేస్తూ ఎస్పీ నిర్ణయం తీసుకున్నారు. క్రైం పార్టీ ముసుగులో అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో కర్నూలు అర్బన్ తాలూకా ఏఎస్ఐ భాస్కర్ రాజు, హెడ్ కానిస్టేబుళ్లు లక్ష్మీనారాయణ, రామకృష్ణ, కానిస్టేబుల్ ప్రసాద్, నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ గోవిందు, కానిస్టేబుల్ నాయక్‌ను జిల్లా సరిహద్దు పోలీస్ స్టేషన్లు మద్దికెర, పెద్దతుంబళం, చిప్పగిరి ప్రాంతాలకు 'అలిగేషన్' డీఓతో బదిలీ చేశారు. నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ గోవిందు, కానిస్టేబుల్ నాయక్ గత ఐదేళ్లగా అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఎనిమిది మందిని శుక్రవారం ఎస్పీ తన కార్యాలయానికి పిలిపించారు. మీపై అలిగేషన్లు ఉన్నాయి.. ఇక్కడి నుంచి వెళ్లిపోండి.. బదిలీ చేసిన స్టేషన్లలో క్రమశిక్షణతో విధులు నిర్వహించండి.. మీలో మార్పు కనిపించినట్లు నేను భావిస్తే మళ్లీ మంచి పోస్టింగ్ ఇస్తానంటూ మందలించి పంపినట్లు సమాచారం.

వ్యవహారాలన్నీ వారి కనుసన్నల్లోనే..

కర్నూలు అర్బన్ తాలూకా, కర్నూలు ఫోర్త్ టౌన్, కర్నూలు టూటౌన్ స్టేషన్లలో కీలక వ్యవహారాలన్నీ క్రైం పార్టీ కనుసన్నల్లోనే కొనసాగుతున్నాయనే విమర్శల నేపథ్యంలో ఎస్పీ ప్రత్యేక విచారణ జరిపించారు. స్టేషన్ మెట్లు ఎక్కే ప్రతి ఫిర్యాదుదారు నుంచి ఏదో ఒక రూపంలో వసూలు చేయడంలో క్రైం పార్టీ సిబ్బంది సిద్ధహస్తులని థర్డ్ పార్టీ విచారణలో బయటపడినట్లు పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది. బాధితులు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగానే దొంగలను పట్టుకురావడం, సగం మాత్రమే రికవరీ అయిందని, మిగతా సగం నొక్కేస్తున్నట్లు ఫిర్యాదుల నేపథ్యంలో ఆ స్టేషన్ క్రైం పార్టీ సిబ్బంది పనితీరుపై విచారణ జరిపించి చర్యలు తీసుకున్నట్లు సహోద్యోగుల్లో చర్చ జరుగుతోంది. అవినీతి ఆరోపణలతో ఒకేసారి ఎనిమిది మందిపై బదిలీ వేటు వేయడం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మరికొందరిపైనా విచారణ కొనసాగుతున్నట్లు తెలిసింది.

ఓ సీఐకి, ఎస్ఐకి చీవాట్లు

కర్నూలు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని ఓ స్టేషన్‌లో పనిచేస్తున్న సీఐ, ఎస్ఐల మధ్య కొంతకాలంగా ఆధిపత్య పోరు నడుస్తోంది. స్టేషన్‌కు వచ్చే నెలవారీ మామూళ్లతో పాటు ఇసుక, ఎర్రమట్టి (గ్రావెల్) అక్రమ రవాణాదారుల నుంచి మామూళ్ల వసూలులో ఇరువురి మధ్య కోల్డ్ వార్ నడుస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో ఎస్పీ వారిద్దరినీ తన కార్యాలయానికి పిలిపించుకొని గట్టిగా మందలించినట్లు సమాచారం. కొన్ని స్టేషన్లలో విధులు పక్కనపెట్టి అధికారుల అండతో వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు అందడంతో నిఘా వర్గాల ద్వారా విచారణ జరిపిస్తున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

- రేంజ్ డీఐజీగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కోయ ప్రవీణ్

కర్నూలు: 'రేంజ్ పరిధిలోని కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల పోలీసు అధికారుల సమన్వయంతో శాంతిభద్రతల పరిరక్షణ సమష్టిగా పని చేస్తాం. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా'నని కర్నూలు రేంజ్ నూతన డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ అన్నారు. నగరంలోని బి.క్యాంప్ రేంజ్ కార్యాలయంలో ఆయన శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా ఇక్కడున్న విజయరావును అమరావతి హెడ్ క్వార్టర్స్‌కు, గ్రేహౌండ్స్‌లో విధులు నిర్వహిస్తున్న కోయ ప్రవీణ్‌ను కర్నూలుకు బదిలీ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా పోలవరానికి చెందిన ఈయన 2009 ఐపీఎస్ బ్యాచ్ అధికారి. 2004లో కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ఈయన గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా పార్వతీపురం, వరంగల్, విజయనగరం ఓఎస్‌డీగా, విశాఖపట్నం రూరల్ ఎస్పీగా, విజయవాడ డీసీపీగా, కాకినాడ, ప్రకాశం జిల్లాల్లో సీపోర్టు డైరెక్టర్‌గా, గుంతకల్లు రైల్వే, పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్, 16వ బెటాలియన్ కమాండెంట్‌గా, ఆక్టోపస్, పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్‌లో ఎస్పీగా సేవలందించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమకు బదిలీపై రావడం ఇదే మొదటిసారి అన్నారు. సీమలో ప్రశాంత వాతావరణం కల్పించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా సీమ జిల్లాల ఎస్పీలు జి.బిందు మాధవ్, ఆదిరాజ్‌సింగ్ రాణా, హర్షవర్ధన్ రాజు, విద్యాసాగర్ నాయుడు, సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మేకల మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు డీఐజీని మర్యాదపూర్వకంగా కలసి పూలబొకే ఇచ్చి స్వాగతం పలికారు.



డీఐజీకి మొక్క ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న కర్నూలు ఎస్పీ బిందు మాధవ్

కౌలు రైతుకు అందని భరోసా

- నత్తనడకన సీసీఆర్ కార్డుల పంపిణీ
- ఈ ఏడాది ఇవ్వాల్సిన కార్డుల లక్ష్యం 22,235
- ఇప్పటి వరకు తీసుకున్నది 3,892 మంది మాత్రమే
- గతేడాది 94 శాతం మంది రైతులకు కార్డుల పంపిణీ



సీసీఆర్ కార్డుల పంపిణీ తీరు ఇది..

డివిజన్ పేరు	పంపిణీ చేయాల్సినవి	పంపిణీ చేసినవి
ఆదోని	9,570	1,800
కర్నూలు	8,079	904
పత్తికొండ	4,595	1,188

కర్నూలు(సెంట్రల్): అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కౌలు రైతులను పట్టించుకోవడం లేదు. ఖరీఫ్ ప్రారంభానికి ముందు ఇవ్వాల్సిన క్రాప్ కల్టివేటర్ రైట్స్(సీసీఆర్) కార్డులను ఇంత వరకు ఇవ్వకున్నా స్పందించడం లేదు. జిల్లాలో దాదాపు 6 లక్షల మంది రైతులు ఉన్నారు. ఇందులో పదెకరాల లోపు భూములున్న రైతులు 2.96 లక్షల మంది ఉన్నారు. ఇదే సమయంలో అధికారులు జిల్లాలో 22,235 మంది కౌలు రైతులు ఉన్నట్లు గుర్తించారు. వీరికి సీసీఆర్ కార్డులు జారీ చేస్తే ప్రభుత్వం నుంచి పంటలు నష్టపోయిన సమయంలో పరిహారం పొందవచ్చు. పంట పెట్టుబడి కోసం బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవచ్చు. ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, వ్యవసాయానికి అవసరమైన పనిముట్లను పొందవచ్చు. వైఎస్సార్‌సీపీ హయాంలో సీసీఆర్ కార్డులను అందుకున్న రైతులకు ప్రభుత్వ పథకాలన్నీ అందాయి. కొత్త ప్రభుత్వం రావడంతో ఈ ఏడాది సీసీఆర్ కార్డులను రైతులకు ఇవ్వడంలో తీవ్ర నిర్లక్ష్యం అలుముకొంది. దీంతో కౌలు రైతులకు రుణాలు అందే పరిస్థితులు కనిపించడం లేదు.

అధికారుల నిర్లక్ష్యం

గతేడాది కౌలు రైతులకు సీసీఆర్ కార్డుల పంపిణీ అనుకున్న సమయానికి జరిగింది. జిల్లాలోని 472 రెవెన్యూ గ్రామాలకు సంబంధించి 20,028 మంది కౌలు రైతులను గుర్తించి సీసీఆర్ కార్డులను ఇవ్వాలని అధికారులు గుర్తించి 18,758 మందికి పంపిణీ చేశారు. దాదాపు 94 శాతం మంది కౌలు రైతులకు కార్డులు ఇవ్వడంతో ప్రభుత్వ సబ్సిడీలను పొందారు. బ్యాంకుల నుంచి పంట పెట్టుబడి కోసం రుణాలను తీసుకున్నారు. అయితే ఈ సంవత్సరం మాత్రం సీసీఆర్ కార్డుల పంపిణీ నత్తనడకన సాగుతోంది. రెవెన్యూ, అగ్రికల్చర్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ వ్యవసాయ సంవత్సరానికి సంబంధించి 22,235 మంది రైతులకు కార్డులు ఇవ్వాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 3,892మంది రైతులకు మాత్రమే పంపిణీ చేశారు. ఆగస్టు 2లోపు ఇచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నా..అప్పటికే ఖరీఫ్ ప్రారంభమై దాదాపు రెండు నెలల సమయం గడిచిపోతుంది. ఆ సమయంలో రైతులకు కార్డులు ఏవిధంగా ఉపయోగపడతాయో అధికారులే చెప్పాలి.

ఆగస్టులోపు పంపిణీ చేస్తాం



కౌలు రైతులకు సీసీఆర్ కార్డుల పంపిణీపై దృష్టి సారించాం. ఇప్పటికే 18 శాతం మంది రైతులకు కార్డులు అందాయి. ఆగస్టు 2లోపు వంద శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. సీసీఆర్ కార్డులను పంపిణీని వేగవంతం చేస్తాం.

– నారపురెడ్డి మౌర్య, జాయింట్ కలెక్టర్

లోటు వర్షపాతం 61 శాతం

కర్నూలు(అగ్రికల్చర్): దాదాపు వారం రోజులుగా వర్షాలు పడుతున్న ఒక్కరోజు కూడా జిల్లా సగటు వర్షపాతం 10 మి.మీ నమోదుకాని పరిస్థితి. జూలై నెల సాధారణ వర్షపాతం 90.7 మి.మీ ఉండగా.. 20 రోజుల్లో 35.5 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ లెక్కన జూలై నెలకు సంబంధించి 61 శాతం లోటు వర్షపాతం ఉన్నట్లు స్పష్టమవుతోంది. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు 22 మండలాల్లో వర్షం కురిసింది. జిల్లా సగటున 3.8 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. ఒకటి, రెండు మండలాలు మినహా మిగిలిన మండలాల్లో వర్షాలు తేలికపాటికే పరిమితం అవుతున్నాయి. దేవనకొండలో అత్యధికంగా 22.6, సి.బెళగల్‌లో అత్యల్పంగా 0.2 మి.మీ వర్షపాతం నమోదైంది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి జిల్లాలో ముసురు పట్టుకున్నప్పటికి తేలికపాటికే వర్షాలు పరిమితం అయ్యాయి. కర్నూలులో మాత్రమే ఒక మోస్తరు వర్షం కురిసింది.

క్లుప్తంగా

పెండింగ్ జీతాలు చెల్లించండి

కర్నూలు(అర్బన్): ఆరు నెలలుగా పెండింగ్ లోని జీతాలను మంజూరు చేయాలని ఏపీఈడబ్ల్యూఐడీసీ ఆల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ జేఏసీ నేతలు కోరారు. ఈ మేరకు శుక్రవారం సీఈ నరసింహమూర్తి, ఎస్ఈ వరప్రసాద్, ఈఈ/ఎస్ఈ ఎస్ శివకుమార్, అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోన నాగరాజు తదితరులు మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిటైర్డు ఉద్యోగులకు టెర్మినల్ బెనిఫిట్స్‌కు రూ.20 కోట్లు, రెగ్యులర్ వర్కింగ్ ఉద్యోగుల జీతాలకు రూ.25 కోట్లు (మొత్తం రూ.45 కోట్లు) స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ద్వారా అడ్వాన్స్‌గా మంజూరు చేయించాలని కోరామన్నారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్.రాయన్న, ఉపాధ్యక్షులు కె.రామారావు, ఈఈ ఆర్.జయాకర్, వెంకట్రావ్, రామచంద్ర తదితరులు ఉన్నారు.

పారామెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): పారామెడికల్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, తత్సమాన విద్యార్హత కలిగిన విద్యార్థులు ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులు www.a ppm b.c-o.i n/a pprah pc.-c-o.i n వెబ్‌సైట్‌లో లభిస్తాయన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఆగస్టు 6వ తేది సాయంత్రం 5 గంటల్లోపు మెడికల్ కాలేజీలో అందజేయాలన్నారు. పోస్టు ద్వారా వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవన్నారు. దరఖాస్తుదారులకు ఆగస్టు 19న కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

తగ్గింపు ధరకు చేనేత వస్త్రాలు

కర్నూలు(అగ్రికల్చర్): చేనేత వస్త్రాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు భారీ తగ్గింపు ధరలకు విక్రయించే విధంగా ఆప్కో చర్యలు చేపట్టిందని డివిజనల్ మేనేజర్ ఎం.మధుబాబు తెలిపారు. 30 నుంచి 50 శాతం వరకు తగ్గింపు సదుపాయం కల్పిస్తున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరుల్లోని అన్ని ఆప్కో చేనేత వస్త్ర దుకాణాల్లో ఈ తగ్గింపు సదుపాయం ఉందని ఆయన శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, మెడికల్, నర్సింగ్ కాలేజీలు, ఐటీఐ, ఫార్మసీ కాలేజీలు, అన్ని ప్రభుత్వ శాఖలకు యూనిఫామ్స్, అప్రాన్స్ లభిస్తాయని ఆయన వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ చేనేతకారులకు సహకారం అందించాలని కోరారు.

ఇసుక అక్రమ రవాణాపై సెబ్ దాడులు



ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసిన సెబ్ అధికారులు

కర్నూలు:స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో ఇసుక అక్రమ రవాణాపై జిల్లావ్యాప్తంగా దాడు లు నిర్వహించారు. ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు సెబ్ సిబ్బంది అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వినోద్ ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి శుక్రవారం దాడులు నిర్వహించారు. కర్నూలు బిర్లా గేట్ వద్ద రెండు ట్రాక్టర్లు, ఆదోనిలో డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ టీమ్, ఇంటెలిజెన్స్ టీమ్ ఆధ్వర్యంలో రెండు ట్రాక్టర్లు, పత్తికొండ సెబ్ ఎస్ఐ టీమ్ ఆధ్వర్యంలో ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసి రూ.50 వేలు జరిమానా విధించి ప్రభుత్వ ఖజానాకు జమ చేశారు.

16 టీఎంసీలు.. 35వేల ఎకరాలు

- 29 నుంచి తుంగభద్ర దిగువ కాలువకు సాగునీరు
- సాగు ,తాగునీటికి సంబంధించి 146 పనులకు రూ. 12.77 కోట్లతో ప్రతిపాదనలు
- ఐఏబీ సమావేశంలో ఆమోదం తెలిపిన ప్రజాప్రతినిధులు, అధికారులు



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు(సెంట్రల్): తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) కింద ఖరీఫ్ సాగు కోసం 16 టీఎంసీల నీటి వినియోగానికి జిల్లా స్థాయి ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు(ఐఏబీ) సమావేశం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జూలై 29 నుంచి ఎల్లెల్సీకి సాగునీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. కాగా.. గతేడాది ఖరీఫ్‌లో 43,519 ఎకరాలకు సాగునీరు ఇవ్వగా.. ఈసారి మాత్రం 35 వేల ఎకరాలకు ఆయకట్టును స్థిరీకరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధ్యక్షతన ఐఏబీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి పరిశ్రమల శాఖమంత్రి టీజీ భరత్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్సీ మధుసూదన్, ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, కేఈ శ్యామ్‌బాబు, బొగ్గుల దస్తగిరి, పార్థసారథి, బి.విరూపాక్షి హాజరయ్యారు. ముందుగా ఇరిగేషన్ శాఖ ఎస్ఈ రెడ్డి శేఖర్ ఐఏబీ తీర్మానాన్ని ప్రతిపాదించగా సభ్యులు ఆమోదించారు. అనంతరం తీర్మానంపై చర్చించారు.

- మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బంది కలగకుండా ఉన్న నీటి వనరులను వినియోగించుకోవాలన్నారు. గాజులదిన్నె ప్రాజెక్టు గేట్లు ఎందుకు దెబ్బతింటున్నాయని ప్రశ్నించగా ఎస్ఈ సమాధానం ఇస్తూ కర్నూలుకు తాగునీటి కోసం ఎక్కువగా నీరు ప్రాజెక్టులో నిల్వ ఉండడంతో గేట్లు తుప్పుపడుతున్నాయని, కర్నూలు నీటి అవసరాల కోసం వేరే ట్యాంకులను నిర్మిస్తే బాగుంటుందని వివరించారు. మంత్రి స్పందిస్తూ.. అత్యవసరంగా సాగు, తాగునీటి పనుల కోసం సీఎంతో మాట్లాడి నిధులు తెప్పించేందుకు కృషి చేస్తానన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా 5.2 టీఎంసీల నీటిని వినియోగించి 32 వేల ఎకరాలకు సాగునీటిని ఇచ్చేందుకు ప్రతిపాదించినట్లు తెలిపారు.
- ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ.. వేదవతి రిజర్వాయర్ కోసం భూసేకరణ చేస్తే నిధులు మంజూరు చేయడానికి సీఎం చంద్రబాబునాయుడు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇరిగేషన్ అధికారులు మాట్లాడుతూ.. రిజర్వాయర్ కోసం 4,500 ఎకరాల భూమి కావాలని, అందులో 600 ఎకరాలను సేకరించామని, మిగతా భూ సేకరణ, పరిహారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.
- కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ.. సాగు, తాగునీటికి సంబంధించి 146 పనుల కోసం రూ.12.77 కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. ఎస్ఎస్ ట్యాంకులు, అవసరం ఉన్న ప్రాజెక్టులను ప్రతిపాదించాలని ప్రజాప్రతినిధులను సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో 51 ఎత్తిపోతల పథకాల ద్వారా 22,041 ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాల కింద 40 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.
- పందికోన రిజర్వాయర్ నుంచి పత్తికొండ మండలానికి ఎందుకు నీళ్లు ఇవ్వడంలేదని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌బాబు ప్రశ్నించారు. జీఓ 365 ప్రకారం రిజర్వాయర్ విస్తరణకు అవకాశం లేదని ఎస్ఈ తెలిపారు. ఈసారి రూ. 180 కోట్లతో ఆ పనులను పూర్తి చేసి నీటిని ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.
- కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ..నియోజకవర్గంలోని పులకుర్తి, మునగాల, కృష్ణదొడ్డి రిజర్వాయర్లను పూర్తి చేసి నీళ్లు ఇవ్వాలని కోరారు.
- ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ..ఆక్రమణకు గురైన చెరువుల స్థలాలను స్వాధీనం చేసుకోవాలన్నారు.
- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ..కల్లూరు మండలంలోని ఉలిందకొండ, తడకనపల్లె, చిన్నటేకూరు, తండాల చెరువులకు హెచ్ఎన్ఎస్ ద్వారా నీటిని నింపాలన్నారు.

హోదా లేకున్నా సమావేశంలో తిక్కారెడ్డి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ఐఏబీ సమావేశానికి రావడం వివాదాస్పదమైంది. ఆయన ఏ హోదాతో సమావేశానికి వచ్చి ప్రజాప్రతినిధులతో కలసి కూర్చున్నారనే ప్రశ్న ప్రతి ఒక్కరూ వేస్తున్నారు. ఆయన కనీసం సాగునీటి సంఘాల్లోనూ సభ్యుడు కాదు. వ్యవసాయ సంఘాల్లోనూ ఆయన స్థానంలేదు. ఆయన ప్రస్తుతం టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా మాత్రమే ఉన్నారు.



ఎలాంటి హోదా లేకున్నా ఐఏబీ సమావేశానికి హాజరైన తిక్కారెడ్డి

23న ఇంటర్వ్యూలకు హాజరుకండి

నంద్యాల(అర్బన్): సఖీ వన్ స్టాఫ్ సెంటర్(మిషన్ శక్తి-సింబల్)లో పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారు ఈనెల 23న జేసీ బంగ్లాలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి నిర్మల శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఆఫీసు అసిస్టెంట్ విత్ కంప్యూటర్ నాలెడ్జ్, పారామెడికల్ పర్సనల్, మల్టీ పర్పస్ స్టాఫ్, సెక్యూరిటీ గార్డు పోస్టులతోపాటు పోషణ్ అభియాన్‌లోని జిల్లా ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్టులకు గత మార్చి 12న జరగాల్సిన ఇంటర్వ్యూలు ఈనెల 23న నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా వెబ్‌సైట్ https://nandyal.ap.gov.in లో అభ్యర్థుల వివరాలు ఉంచామని, సరిచూసుకుని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

'అగ్నివీర్'కు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(అర్బన్): అగ్నివీర్ పథకంలో భాగంగా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారిణి దీప్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21 ఏళ్ల వయస్సులోపు ఉండి 50 శాతం మార్కులతో మ్యాథమ్యాటిక్స్, ఫిజిక్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులతో ఇంటర్మీడియెట్, మూడేళ్ల ఇంజినీరింగ్ డిప్లమోతో సమానమైన విద్యార్హతలు కలిగి ఉండి, వివాహం కాని పురుష, మహిళా అభ్యర్థులు ఈనెల 28 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో రాత పరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్, మెడికల్ ఫిట్‌నెస్ పరీక్షలతో పాటు ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ https://agnipathvayucdac.in లో చూడవచ్చన్నారు.

'జలశక్తి' పనులు సంతృప్తికరం



ఐరన్‌బండ గ్రామంలో జల్‌జీవన్ మిషన్ గురించి సెంట్రల్ టీమ్‌కు వివరిస్తున్న జేసీ మౌర్య

- సమన్వయంతో పనిచేస్తున్నారంటూ జిల్లా అధికారులకు కితాబు
- రెండో రోజూ జిల్లాలో పర్యటించిన సెంట్రల్ టీమ్

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో జలశక్తి అభియాన్ పనులు సంతృప్తికరంగా ఉన్నాయని సెంట్రల్ టీమ్ నోడల్ అధికారి, డిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రిన్స్‌పల్ కమిషనర్ చిత్తరంజన్‌దాస్ కితాబిచ్చారు. జిల్లాకు వచ్చిన జల్‌శక్తి అభియాన్ బృంద ప్రతినిధులు రెండో రోజు శుక్రవారం గోనెగండ్ల, ఎమ్మిగనూరు మండలాల్లో పర్యటించారు. జలశక్తి అభియాన్ టీమ్ సాంకేతిక అధికారి, సీటెక్ సైంటిస్ట్ బిజయ్‌కేతన్ మోహితాతో కలసి జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య కూడా పాల్గొన్నారు. జిల్లాలో జరుగుతున్న జలశక్తి అభియాన్ కార్యక్రమాలను, జల్‌జీవన్ మిషన్‌తో గ్రామీణ ప్రజలకు కలుగుతున్న ఉపయోగాలను వివరించారు. గాజులదిన్నె ప్రాజెక్టు గురించి డీఈ విజయకుమార్ అడిగి తెలుసుకున్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో నిర్మించిన రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌ను , ఐరన్‌బండ గ్రామంలో జల్‌జీవన్ మిషన్ కింద ఇళ్లకు కుళాయిల కనెక్షన్లు పరిశీలించారు. గ్రామంలో ఫాంపాండ్‌ను పరిశీలించి, ఉపయోగాలు తెలుసుకున్నారు. ఎమ్మిగనూరు మండలం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. నర్సరీ, వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లను పరిశీలించారు. ఎమ్మిగనూరులో చేనేత సహకార సంఘం కార్యాలయాన్ని సందర్శించి.. వస్త్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి, నీటిపారుదల, ఆర్‌డబ్ల్యూఎస్, భూగర్భ జలవనరుల శాఖ అధికారులు, డ్వామా ఏపీడీలు పాల్గొన్నారు. జిల్లా పర్యటన ముగియడంతో కేంద్ర బృంద సభ్యులు శనివారం ఉదయం కర్నూలు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరుతారని డ్వామా పీడీ అమరనాథరెడ్డి తెలిపారు.

వ్యవసాయ స్థితిగతులపై సమీక్ష

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. శుక్రవారం గుంటూరు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. రైతు సేవాకేంద్రాల ఇన్‌చార్జ్ పోస్టులు ఎన్ని? ఎంతమంది పనిచే స్తున్నారు? ఎన్ని ఖాళీలు ఉన్నాయి. ఏడీఏ, ఏఓ పోస్టులు ఖాళీలు ఉన్నాయా? తదితర వివరాలు తెలుసుకున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి మాట్లాడుతూ... పోస్టుల భర్తీ, పంటల పరిస్థితి, వర్షపాతం, ఎరువుల వివరాలను డైరెక్టర్‌కు వివరించారు. డైరెక్టర్ మాట్లాడుతూ.. రసాయన ఎరువుల వినియోగం తగ్గించడం ద్వారా రైతుల పెట్టుబడి వ్యయాన్ని గణనీయంగా తగ్గించాలని సూచించారు. ఎరువులకు కృత్రిమ కొరత సృష్టించకుండా చర్యలు చేపట్టారు. కర్నూలు నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో డీఏఓ వరలక్ష్మితో పాటు ఏడీఏలు సాలురెడ్డి, మహమ్మద్ ఖాద్రి, అరుణకుమారి, సునీత, అగ్రానమీ ఏడీఏ బాలవర్ధిరాజు, సాంకేతిక ఏఓలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో షెడ్ల నిర్మాణం

గత టీడీపీ పాలనలో గోకులాలు

- అప్పట్లో టీడీపీ కార్యకర్తలకే కేటాయించారని విమర్శలు
- తిరిగి అదే ప్రభుత్వంలో తెరపైకి షెడ్లు
- లబ్ధిదారుల ఎంపికకు ఆదేశాలు

షెడ్ల నిర్మాణాలకు సబ్సిడీలు ఇలా..

షెడ్డు	యూనిట్ కాస్ట్ (రూపాయల్లో)	సబ్సిడీ 90శాతం(రూ॥ల్లో)	రైతు వాటా 10 శాతం(రూ॥ల్లో)
రెండు పశువులు	1,15,000	1,03,500	11,500
నాలుగు పశువులు	1,85,000	1,66,500	18500
ఆరు పశువులు	2,30,000	2,07,500	23,000

గొర్రెలు-మేకలు, కోళ్ల షెడ్లు

షెడ్లు	యూనిట్ కాస్ట్ (రూ॥ల్లో)	సబ్సిడీ(70 శాతం) (రూ॥ల్లో)	రైతు వాటా(30శాతం) (రూ॥ల్లో)
20 గొర్రెలు/మేకలు	1,30,000	91,000	39,000
50 మేకలు/గొర్రెలు	2,30,000	1,61,000	69,000
100 కోళ్లు	87,000	60,900	26,100
200 కోళ్లు	1,32,000	92,400	39,600

కర్నూలు(అగ్రికల్చర్): 2018–19 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం గోకులం పేరుతో పశువులు, సన్న జీవాలు, కోళ్లకు షెడ్లు నిర్మించే కార్యక్రమాన్ని చేపట్టింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో ఈ నిర్మాణాలు చేపట్టారు. టీడీపీ కార్యకర్తలకే వీటిని కేటాయించారనే ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రైతుభరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు, బల్క్ మిల్క్ కూలింగ్ కేంద్రాలు వంటి శాశ్వత భవనాల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇచ్చింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ నిర్మాణాలను పక్కన పెట్టింది. మళ్లీ నాటి గోకులం తరహాలోనే 90 శాతం సబ్సిడీతో పశువులు, గొర్రెలు-మేకలు, కోళ్లకు షెడ్లు నిర్మిస్తోంది. ఈ మేరకు ప్రభుత్వం ఉ త్తర్వులు జారీ చేసింది. 90 శాతం సబ్సిడీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధుల నుంచి లభిస్తుంది.

ఉమ్మడి జిల్లాకు 2,050 షెడ్లు కేటాయింపు

కర్నూలు జిల్లాకు 1,200, నంద్యాల జిల్లాకు 850 చొప్పున షెడ్లను కేటాయించారు. వీటి నిర్మాణానికి ఉపాధి హామీ జాబ్‌కార్డు తప్పనిసరి చేశారు. గ్రామ సభ ఆమోదం కూడా తీసుకోవాల్సి ఉంటుంది. పశువుల షెడ్లకు 90 శాతం, గొర్రెలు మేకలు, కోళ్ల షెడ్లకు 70 శాతం సబ్సిడీ ఉంటుంది. పశుసంవర్థక శాఖ లబ్ధిదారులను ఎంపిక చేస్తుంది. షెడ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత ఉపాధి నిధుల నుంచి సబ్సిడీ చెల్లిస్తారు. లబ్ధిదారుల ఎంపికపై దృష్టి సారించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ జి.శ్రీనివాస్ వెటర్నరీ అసిస్టెంటు సర్జన్‌లు, ఏరియా పశువైద్యశాలల ఏడీలకు ఉత్తర్వులు జారీచేశారు. గోకులం తరహాలోనే ప్రస్తుత షెడ్లను కూడ టీడీపీ కార్యకర్తలకే మంజూరు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. టీడీపీ ఎమ్మెల్యేలు/ ఇన్‌చార్జీల సిపారస్సు లేఖను తప్పనిసరి చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

యువతి బలవన్మరణం

కర్నూలు (అగ్రికల్చర్) : కర్నూలు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమిశెట్టి నగర్‌కు చెందిన పి.మనీషా శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈమె సురేష్ కుమార్‌ను నాలుగు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. సురేష్ కుమార్‌కు మనీషా రెండవ భార్య. సురేష్ కుమార్ ఈవెంట్ మ్యూజికల్ డ్యాన్సర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల కాలంలో సురేష్ కుమార్ డ్యాన్స్ గ్రూప్‌లో ఉన్న మరో మహిళతో చనువుగా ఉంటున్నాడు. ఈ విషయంపై దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఎంత ప్రయత్నించినా భర్తలో మార్పు రానందుకు మనస్తాపం చెంది సాయంత్రం 6:20 గంటల ప్రాంతంలో బెడ్‌రూమ్‌లో ఉన్న ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మనీషా తల్లి కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వినుకొండ ఘటన అత్యంత క్రూరం



మాట్లాడుతున్న మద్దూరు సుభాష్ చంద్రబోస్

కర్నూలు (టౌన్): పల్నాడు జిల్లా వినుకొండలో బుధవారం నడిరోడ్డుపై రషీద్ అనే యువకుడిని కొబ్బరి బోండాలు నరికే కత్తితో దారుణంగా నరికి చంపడం అత్యంత క్రూరమైన చర్య అని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆయన శుక్రవారం సి.క్యాంపులోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పట్టణ నడిబొడ్డున ప్రజలు భయభ్రాంతులకు గురయ్యే విధంగా విచక్షణా రహితంగా చేతులు తెగనరికి కిరాతకంగా హత్య చేయడం అటవిక రాజ్యాన్ని తలపిస్తోందన్నారు. హంతకుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే ఒక పార్లమెంటు సభ్యుడిగా మిథున్ రెడ్డి పుంగనూరు పర్యటనకు వెళ్తే ఆయనపై రాళ్ల దాడి చేయడం, వాహనాలను తగలబెట్టడం, మాజీ ఎంపీ రెడ్డప్ప తదితర వైస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం సరికాదన్నారు. రాష్ట్రంలోని ప్రజాస్వామ్య వాదులంతా ఈ ఘటనలను ఖండించాలన్నారు. గత నెలన్నర రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలను అరికట్టాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ, నాయకులు, సానుభూతిపరుల ఇళ్లను కూల్చడం, దాడులకు పాల్పడడం, వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేయడం తప్పా ప్రభుత్వం చేసిందేమీ లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

తప్పుడు ఐటీ రిటర్న్ దాఖలు చేస్తే చర్యలు

- ఆదాయపు పన్ను శాఖ జాయింట్ కమిషనర్ టీవీ వంశీధర్



సమావేశంలో మాట్లాడుతున్న టీవీ వంశీధర్

కర్నూలు(హాస్పిటల్): ఉద్యోగులు, వ్యాపారులు ఆదాయపు పన్నును ఎగ్గొట్టేందుకు తప్పుడు రిటర్న్ దాఖలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదాయపు పన్ను శాఖ జాయింట్ కమిషనర్(తిరుపతి, కర్నూలు, నెల్లూరు రేంజ్) టీవీ వంశీధర్ హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కొత్తబస్టాండ్ సమీపంలోని క్రెడాయ్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కోవిడ్ సమయం నుంచి తప్పుడు రిటర్న్ ఫైల్ చేసే వారి సంఖ్య పెరిగిందన్నారు. ఇలాంటి వారిని గుర్తించి ఇటీవల కాలంలో తిరుపతి, కర్నూలు, నెల్లూరు రీజన్‌లో రూ.7వేలకోట్ల దాకా జరిమానా వసూలు చేసినట్లు తెలిపారు. తప్పుడు రిటర్న్ దాఖలు చేసేవారిలో ఉద్యోగులు ఎక్కువగా ఉన్నారని చెప్పారు. ఇటీవల కాలంలో ఐటీ ఉద్యోగుల సంఖ్య ఎక్కువగా ఉందని, ఆదాయపు పన్నులు వసూలు అయితే అది దేశాభివృద్ధికి ఉపయోగపడుతుందన్న విషయం మరువకూడదన్నారు. అసిస్టెంట్ కమిషనర్ వి. దయానందప్రసాద్ మాట్లాడుతూ తాము కష్టపడి సంపాదించిన డబ్బును ఆదాయపు పన్ను రూపేణా ప్రభుత్వానికి ఎందుకు చెల్లించాలని కొందరు ప్రశ్నిస్తున్నారని, దేశంలో మీరు అనుభవిస్తున్న, చూస్తున్న అభివృద్ధి అంతా ఇలా వచ్చిన పన్నుల నుంచే అన్న సంగతి మరువరాదన్నారు. ఇతర దేశాల్లో కంటే మన దేశంలోనే ఆదాయపు పన్ను శాతం తక్కువగా ఉందన్నారు. ఆదాయం పన్ను చెల్లించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు పీవీ కిరణ్‌కుమార్, ట్యాక్స్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బుచ్చన్న, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఐ. విజయకుమార్‌రెడ్డి, షణ్ముకేష్, చార్టెట్ అకౌంటెంట్లు, ట్యాక్స్ ప్రొఫెషనల్స్, ట్రెజరి అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భర్త దుర్మరణం

- భార్య, కూతురికి తీవ్ర గాయాలు



మృతి చెందిన హుసేన్‌బాషా

గోస్పాడు: మండల పరిధిలోని పసురపాడు-ఎస్.నాగలవరం గ్రామాల మధ్య శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా, భార్య, కూతురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. శిరివెళ్లకు చెందిన షేక్ ఉసేన్ బాషా(35) పాలిష్ కట్టర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. అత్తగారింటికి వెళ్లి మోటారు బైకుపై భార్య షాహిదా, కూతురు సుహానాతో కలిసి శిరివెళ్లకు తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న కారు వేగంగా వీరి బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో షేక్ ఉసేన్ బాషా అక్కడికక్కడే మృతిచెందగా షాహిదా, కూతురు సుహాన గాయాలపాలయ్యారు. వీరిని చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మద్దిలేటి తెలిపారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు (లీగల్): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి సూచించారు. ఆయన శుక్రవారం సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు హెల్మెట్ ధారణ, మోటార్ వాహనాల చట్టంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వాహనదారుడితో పాటు వెనక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని సూచించారు. ర్యాగింగ్ దుష్ప్రభావాల గురించి, విద్యాసంస్థల్లో ర్యాగింగ్ నిషేధానికి సంబంధించి శిక్షాపరమైన నిబంధనలు, ర్యాగింగ్‌కు పాల్పడిన వారికి విధించే శిక్షలు తదితర వాటిని వివరించారు. ర్యాగింగ్ వల్ల భవిష్యత్తు నాశనం అవుతుందని చెప్పారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు ఎస్.మనోహర్, ప్రిన్సిపాల్ శాంతి, డీన్ వై.శౌరియులు రెడ్డి, ట్రాఫిక్ సీఐ గౌతమి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.